సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 10 । మార్చి । 2023



ఆపద్బాంధవులు
కాల్ రాగానే నిమిషాల వ్యవధిలో ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రుల ప్రాణాలను రక్షిస్తూ ఆపద్బాంధవులుగా నిలుస్తున్నారు 108 సిబ్బంది. – 8లో ▸



సెల్‌ఫోన్ల రికవరీ
ఏలూరు పోలీసులు ఆరో విడతలో రూ.41.40 లక్షల విలువైన 207 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్టు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ తెలిపారు. – 8లో ▸



ఇద్దరి మృతి
లారీ ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన నూజివీడు మండలంలోని మీర్జాపురం వద్ద చోటుచేసుకుంది. – 8లో ▸

న్యూస్‌రీల్

జ్ఞానేశ్వరికి మహిళా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న విశ్వమానవ వేదిక టీమ్ లీడర్ జ్ఞానేశ్వరి

పాలకొల్లు అర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వమానవ వేదిక టీమ్ లీడర్ డాక్టర్ మల్లుల జ్ఞానేశ్వరి విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని తెలుగు ఫిలిం ఛాంబర్ కార్యాలయంలో సినిమా వేదిక, నేస్తం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో సినీ నటి మాధవి చేతులమీదుగా సత్కారం, జ్ఞాపిక అందుకున్నట్లు జ్ఞానేశ్వరి గురువారం విలేకరులకు తెలిపారు. తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి సభ్యులు పి.విజయవర్మ, జేవీ మోహన్‌గౌడ్, కొత్త బసిరెడ్డి, పీఎల్‌కే రెడ్డితో పాటు విశ్వ మానవ వేదిక అధ్యక్షుడు మల్లుల సురేష్, గుంపుల రవి ప్రత్యేకంగా అభినందించారన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ సూర్యతేజ

భీమవరం(ప్రకాశం చౌక్): విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన మందును నూరు శాతం అందించి, వారి ఆరోగ్య పరిరక్షణకు కృషిచేస్తున్నట్టు ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ అన్నారు. ఈనెల 14న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం కలెక్టరేట్‌లో ఆయన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 19 ఏళ్లలోపు విద్యార్థులందరికీ డీవార్మింగ్ ట్యాబ్లెట్లు అందిస్తామన్నారు. సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈనెల 18వ తేదీలోపు నూరుశాతం మాత్రలు అందించేలా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. డీఎంహెచ్‌ఓ డి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అనారోగ్యంగా ఉన్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయరాదని, వారికి నయమైన తర్వాత మాత్రమే ఇవ్వాలని స్పష్టం చేశారు. జిల్లా ప్రోగ్రామ్ అధికారి జె.రమణ, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, సర్వశిక్ష అభియాన్ పీఓ పి.శ్యామ్‌సుందర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, ఐసీడీఎస్ అధికారి బి.సుజతారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వి.ప్రసాద్, డీఎల్‌డీఓ కె.కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

తెన్నేటికి జాతీయ పురస్కారం



తెన్నేటి మాస్టారు

పాలకోడేరు: సాహితీవేత్త, అక్షర కిరీటి తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి (తెన్నేటి మాస్టారు)కు జాతీయస్థాయి ఉగాది పురస్కారం -2023 వరించింది. ఆయన రచించిన 'తేనెలూరు తెలుగు మనది' అనే వ్యాస సంకలనానికి కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య వారు జాతీయ స్థాయిలో ఉగాది పురస్కారాన్ని ప్రకటించినట్టు సమాఖ్య అధ్యక్షుడు జి.చండీశ్వర్, ప్రధాన కార్యదర్శి క్లో వెంకటేశ్వరశాస్త్రి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న బెంగళూరులో జరిగే కార్యక్రమంలో తెన్నేటిని పురస్కారంతో సత్కరించనున్నట్టు సమాఖ్య చైర్మన్ మాల్యాద్రి బొగ్గవరపు తెలిపారు. తెన్నేటి మాస్టారు ప్రస్తుతం పాలకోడేరు జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. శ్రీ పద్మినీ పుర కళా పీఠం గౌరవ అధ్యక్షుడు ఆర్వీఎస్ రాజు, సభ్యులు యండపల్లి పాండురంగ, జి.సుధాకర్ తదితరులు ఆయన్ను అభినందించారు.

టీబీ రోగులకు పోషకాహారం

భీమవరం (ప్రకాశం చౌక్): టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా క్షయ రోగులకు పోషకాహారం అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. నెలకి రూ.700 చొప్పున ఆరు నెలల పాటు 183 మంది రోగులకు పోషకాహారం అందిస్తున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ అధికారి బి.భానునాయక్ మాట్లాడుతూ ట్రిపుల్ ఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ 60 మందిని, వసుధ ఫౌండేషన్ 24 మందిని, ఆంధ్ర సుగర్స్ యాజమాన్యం 10 మందిని, గ్రీన్‌ఆర్మీ సభ్యులు ఐదుగురిని, ఇతరులు ఇద్దరు, ముగ్గురు చొప్పున 48 మందిని మొత్తంగా 183 మంది రోగులను దత్తత తీసుకున్నారన్నారు. క్షయ రహిత సమాజానికి దాతలు భాగస్వాములు కావాలని, పోషకాహారం అందించేవారు సెల్ 99123 41474 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

గోరుముద్దలో రాగి జావ

ఆరోగ్యానికి తోవ
- మధ్యాహ్న భోజనంలో మరిన్ని పోషకాలు
- ఈనెల 21 నుంచి బడి పిల్లలకు రాగి జావ
- ఇప్పటికే రాగి, బెల్లం పొడుల సరఫరా
- వారానికి మూడు రోజుల పాటు అందించేలా చర్యలు



రేషన్ దుకాణం నుంచి రాగి పొడి, బెల్లం పొడి తీసుకుంటున్న పాఠశాలల ప్రతినిధులు

ఏలూరు జిల్లా	
పాఠశాలలు	1,815
విద్యార్థులు	1,49,395
మధ్యాహ్న భోజనం తినేవారు	1,06,913

పశ్చిమగోదావరి	
పాఠశాలలు	1,382
విద్యార్థులు	1,16,698
మధ్యాహ్న భోజనం తినేవారు	77,260

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకాన్ని (మధ్యాహ్న భోజనం) పటిష్టంగా అమలుచేస్తోంది. ఇప్పటికే పథకంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి నాణ్యత, రుచి, పోషకాలకు పెద్దపీట వేశారు. కోడిగుడ్డు, చిక్కీ వంటి అధిక ప్రోటీన్లు, విటమిన్లు ఉండే పదార్థాలను చేర్చారు. అలాగే మంగళవారం పులిహోర, బుధవారం వెజిటబుల్ రైస్ (ఫ్రైడ్‌రైస్), గురువారం కిచిడీ, శనివారం తీపి పొంగలి వంటి రుచికరమైన పదార్థాలను వండి వడ్డిస్తున్నారు. దీంతో మధ్యాహ్న భోజనం తినే విద్యార్థుల సంఖ్య బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో మరిన్ని పోషకాలతో కూడిన ద్రవ పదార్థాలను అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. దీనికి సత్యసాయి సేవా ట్రస్ట్ నుంచి సంపూర్ణ మద్దతు అందడంతో విద్యార్థులకు రాగి జావ అందించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ విద్యా సంవత్సరంలోనే రాగి జావ అందించడం ప్రారంభించేలా సన్నాహాలు చేశారు. తొలుత ఈనెల 2 నుంచి తర్వాత ఈనెల 9 నుంచి ప్రారంభించాలని భావించినా చివరకు ఈనెల 21న ప్రారంభించనున్నట్టు విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ప్రకటించింది.

చిక్కీకి ప్రత్యామ్నాయ రోజుల్లో..
వారంలోని సోమ, బుధ, శుక్రవారాల్లో విద్యార్థులకు చిక్కీని అందిస్తున్నారు. మిగిలిన మంగళ, గురు, శని వారాల్లో చిక్కీకి ప్రత్యామ్నాయంగా రాగి జావను అందించాలని నిర్ణయించారు.

అందరికీ అందించేలా..
ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మొత్తం విద్యార్థులు 2,66,093 మంది ఉండగా 1,84,173 మంది మధ్యాహ్న భోజనాన్ని ఆస్వాదిస్తున్నారు. విద్యార్థుల అభీష్టం మేరకు రాగి జావను అందరు విద్యార్థులకు అందించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం భోజనం తీసుకునే విద్యార్థుల కంటే రాగి జావ తీసుకునే విద్యార్థుల సంఖ్య మరింత పెరగనుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

పాఠశాలలకు చేరిన ముడి సరుకు
రాగి జావ తయారీకి అవసరమైన ముడి సరుకు ఇప్పటికే ఆయా పాఠశాలలకు చేరింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు మరికొన్ని జిల్లాలకు ముడి సరుకును పంపిణీ చేయడానికి సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధులు నూజివీడు మండలం మొరసపూడికి చెందిన సూర్యకుమారి ఏజెన్సీస్‌కు కాంట్రాక్టు అప్పగించారు. ఈ ట్రస్ట్ ఇప్పటికే ఆయా పాఠశాలలు ఉండే ప్రాంతాల్లోని రేషన్ దుకాణాలకు సరుకులను సరఫరా చేయగా, వాటిని పాఠశాలల ప్రతినిధులు తమ పాఠశాలలకు తీసుకువెళ్లారు. విద్యార్థుల సంఖ్యను బట్టి బెల్లం పొడి కిలో, రాగి పొడి కిలో నుంచి ఐదు కిలోల వరకూ పంపిణీ చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నిర్ణయించగా ఆ మేరకు ఈ పాఠశాలకు ఎంత సరఫరా చేయాలనే జాబితా కూడా సిద్ధమైంది. రాగి జావను విద్యార్థులు ఉత్సాహంగా తీసుకునే అవకాశం ఉంది.

రాగి జావతో ప్రయోజనాలెన్నో..



రాగి జావలో తక్కువ కొలెస్ట్రాల్, సోడియం ఉంటుంది. బీ కాంప్లెక్స్, విటమిన్ సీ, ఈ, థయామిన్, రిబోఫ్లావిన్, నియాసిన్, ఫోలిక్ యాసిడ్, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్ అధికంగా ఉంటాయి. మనిషిలోని పోషకాహార లోపాన్ని నివారించడంలో రాగి జావ సహాయకారిగా ఉంటుంది. దీంతో పాటు శరీరంలోని వివిధ భాగాలకు ఆక్సిజన్ సరఫరా చేయడంలో కూడా దీని పాత్ర కీలకం. ఫైబర్ ఎక్కువగా ఉండటంతో ఎక్కువ సేపు ఆకలి వేయదు. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది. దీంతో మానసిక ఆందోళన, నిద్రలేమి సమస్యలు తగ్గుతాయి. ఎముకలు గట్టిపడటానికి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, రక్తంలో గ్లూకోజ్‌ను తగ్గించడానికి పనిచేస్తుంది.

అన్ని ఏర్పాట్లూ చేశాం



జిల్లాలో విద్యార్థులకు రాగి జావ అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. జిల్లాలోని కుక్, హెల్పర్లకు నాణ్యతలో రాజీ లేకుండా జావ తయారు చేయాలని ఆదేశాలిచ్చాం. ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించాం. ఇప్పటికే జావ తయారీకి కావాల్సిన ముడి సరుకులు పాఠశాలలకు చేరాయి.

– ఎస్‌వీ రవిసాగర్, ఏలూరు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

106 కేంద్రాలు.. 72,048 మంది విద్యార్థులు



మాట్లాడుతున్న ప్రాంతీయ పర్యవేణాధికారి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఈనెల 15 నుంచి జరిగే ఇంటర్మీడియెట్ థియరీ పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు ఆదేశించారు. గురువారం స్థానిక సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 106 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నామని, ఫస్టియర్ విద్యార్థులు 33,874 మంది, సెకండియర్ విద్యార్థులు 38,174 మంది హాజరవుతారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోనికి అనుమతించరాదన్నారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్, పోలీస్ బందోబస్తు ఉంటుందన్నారు. కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని నియమించారని, తాగునీటి సమస్య లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తామని, అన్నిచోట్లా బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు జిల్లా డీవీఈఓ బి.ప్రభాకరరావు, పశ్చిమగోదావరి జిల్లా డీవీఈఓ కేవీ సత్యనారాయణ, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లను అనుమతించవద్దు



ఎన్నికల అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సమయంలో ఓటర్ల సెల్‌ఫోన్లను అనుమతించవద్దని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఎన్నికల జోనల్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, కౌంటింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలను పక్కాగా నిర్వహించాలని, నిబంధనలు తప్పక పాటించాలన్నారు. పోలింగ్ సమయంలో కొందరు ఓటర్లు ఓటువేసిన విధానాన్ని సెల్‌ఫోన్లలో ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసే అవకాశం ఉందని, పోలీసు సిబ్బందికి ఫోన్‌ను అప్పగించిన తర్వాతే ఓటర్లను బూత్‌లోకి అనుమతించాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రిని ఈనెల 12వ తేదీ సాయంత్రమే తీసుకుని, అదే రోజు రాత్రికి పోలింగ్ స్టేషన్‌కి చేరుకోవాలన్నారు. 13న ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. సమస్యలుంటే రిటర్నింగ్ ఆఫీసర్ లేదా జోనల్ అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. శుక్రవారం మరోసారి శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. జేసీ, రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు, డీఆర్వో ఏఈఏవీఎస్ఎస్ మూర్తి, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, ఆర్డీఓలు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో శిక్షణ
జిల్లాలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు పూర్తిస్థాయిలో నిర్వహించామని కలెక్టర్ అన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై గురువారం రాష్ట్ర ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే శిక్షణ అందించామని, శుక్రవారం మరోమారు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశామని, మొత్తం 1,300 బ్యాలెట్ పేపర్లు ముద్రించామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్

ఏలూరు టౌన్: ఏలూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల మాక్ పోలింగ్ నిర్వహించారు. పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్‌తో పాటు మేయర్ షేక్ నూర్జహాన్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, పరిశీలకుడు మధ్యాహ్నపు బలరాం మాక్ పోలింగ్‌ను పర్యవేక్షించారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓటును ఎలా వినియోగించుకోవాలనే అంశంపై మాక్ పోలింగ్ ద్వారా అవగాహన కల్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేసిన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి వారి విజయానికి కృషి చేయాలని నగర మేయర్ నూర్జహాన్ పిలుపునిచ్చారు. సామాజిక సమతుల్యత పాటిస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజకీయ రంగంలో సముచిత స్థానాన్ని అందించేలా ఎమ్మెల్సీలుగా, ఇతర రాజకీయ పదవులు, నామినేటెడ్ పదవులకు ఎంపిక చేయడం సీఎం జగన్ దార్శనికతకు నిదర్శనమని బలరాం అన్నారు. నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్ బాబు, కో–ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, మాజీ ఏఎంసీ చైర్మన్ మంచెం మైబాబు, కార్పొరేటర్లు హాజరయ్యారు.

ఎన్నికల ఏజెంట్ల వివరాలు అందించాలి

రిటర్నింగ్ అధికారి అరుణ్‌బాబు



రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న జేసీ అరుణ్‌బాబు

ఏలూరు(మెట్రో): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్ల వివరాలను శుక్రవారం నాటికి అందించాలని జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు రాజకీయ పక్షాలను కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల ఏర్పాట్లపై ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ అరుణ్‌బాబు మాట్లాడుతూ పోటీ చేస్తున్న అభ్యర్థులకు సంబంధించి పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్ల వివరాలను అందజేయాలని, అనంతరం వారి వివరాలు పరిశీలించి గుర్తింపు కార్డులు అందిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాజకీయ పక్షాల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఓటర్ల వివరాలను ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రదర్శిస్తామని, ఓటు వేసేందుకు వచ్చిన ఓటరు వివరాలను పోలింగ్ ఏజెంట్లు ధ్రువీకరించాలన్నారు. పోలింగ్ రోజున ఏజెంట్లు ఉదయం 7 గంటలకు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని, పోలింగ్ బాక్స్, బ్యాలెట్ పత్రాలను పరిశీలించాలన్నారు. ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల్లో ప్రభుత్వ నిబంధనలను వివిధ పార్టీల ప్రతినిధులకు జేసీ తెలియజేశారు. డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, డీఎస్పీ పైడేశ్వరరావు, ఎమ్మెల్సీ అభ్యర్థులు వంక రవీంద్రనాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● శాకంబరి.. శుభంకరి



రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మ జాతర అంగరంగ వైభవంగా జరుగుతోంది. గురువారం మూడో రోజు అమ్మవారిని కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు. ఆలయంలో అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి కల్యాణ్యాన్ని జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

– బుట్టాయగూడెం

ఎస్టీపీలతో మురుగు శుద్ధి

- టిడ్కో సముదాయాల వద్ద నిర్మాణాలు
- మూడు పట్టణాల్లో ప్లాంట్లు
- రూ.35.55 కోట్లతో పనులు
- నీటి కాలుష్యాన్ని అరికట్టేలా చర్యలు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లులోని టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద మురుగునీరు శుద్ధి చేసే ప్లాంట్ల (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇప్పటికే ఆయా ప్లాంట్ల నిర్మాణ పనులు 60 శాతం మేర పూర్తయ్యాయి. టిడ్కో ఇళ్ల నుంచి వాడకం నీరు నేరుగా డ్రెయిన్లు, మురికి కాలువల్లోకి వదలకుండా ఎస్టీపీల్లో శుద్ధిచేసి బయటకు వదిలేలా చర్యలు తీసుకున్నారు. పర్యావరణ పర్యవేక్షణ, నీటి కాలుష్యాన్ని అరికట్టేలా ప్రభుత్వం ఎస్టీపీల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది.

మూడు పట్టణాల్లో..
జిల్లాలోని మూడు పట్టణాల్లోని రూ.35.55 కోట్లతో నాలుగు ప్లాంట్లు నిర్మాణ దశలో ఉన్నాయి. 7.5 లక్షల లీటర్ల నుంచి 50 లక్షల లీటర్ల నీటిను శుద్ధి చేసే సామర్థ్యంతో వీటిని నిర్మిస్తున్నారు. రోజుకు ఆయా పట్టణాల్లో నాలుగు ప్లాంట్ల ద్వారా 1.12 కోట్ల లీటర్ల నీటిని శుద్ధి చేయనున్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలో రెండు ప్లాంట్లు, పాలకొల్లు, భీమవరంలో ఒకటి చొప్పున ప్లాంట్లు నిర్మిస్తున్నారు.

భీమవరంలో పెద్దది : భీమవరంలో టిడ్కో ఇళ్ల వద్ద చేపట్టిన ఎస్టీపీ ప్లాంట్ జిల్లాలో అతి పెద్దది. ఇక్కడ రోజుకు 50 లక్షల లీటర్ల మురుగును శుద్ధి చేయనున్నారు. 8,352 ప్లాట్లకు సంబంధించి మురుగు నీటిని శుద్ధి చేసేలా ఇక్కడ ఏర్పాట్లు చేశారు. ప్రజారోగ్య విభాగం నుంచి రూ.15.75 కోట్లు మంజూరు చేశారు. పాలకొల్లు, తాడేపల్లిగూడెంలో ప్లాంట్లను టిడ్కో హౌసింగ్ వారు నిర్మిస్తున్నారు.



తాడేపల్లిగూడెంలో ప్లాంట్ నిర్మాణం



భీమవరంలో ఇలా..

ఎస్టీపీలు ఇలా..

పట్టణం	సామర్థ్యం (లక్షల లీటర్లు)	ఖర్చు (రూ.కోట్లలో)
తాడేపల్లిగూడెం	20	6.10
తాడేపల్లిగూడెం	7.50	3.65
భీమవరం	50	15.75
పాలకొల్లు	35	10.05

60 శాతం పూర్తి
జిల్లాలో పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం పట్టణాల్లో టిడ్కో ఇళ్ల సముదాయం వద్ద చేపట్టిన ఎస్టీపీల నిర్మాణం 60 శాతం పూర్తయ్యాయి. వేగంగా పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకున్నాం.

– ఎంఎస్ స్వామినాయుడు, టిడ్కో పీఓ

19,872 ప్లాట్లు
జిల్లాలోని మూడు పట్టణాల్లో టిడ్కో సముదాయాల్లో 19,872 ప్లాట్ల నిర్మాణం చేపట్టగా ఫేజ్–1లో లబ్ధిదారులకు 6,048 ప్లాట్లు అప్పగించారు. మిగిలిన ప్లాట్లను ఎస్టీపీల నిర్మాణం పూర్తిచేసి అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నారు.

శివాలయ నిర్మాణానికి భూమి పూజ



నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

ఉంగుటూరు: గోపినాథపట్నంలోని భక్తాంజనేయస్వామి ఆలయ ప్రాకారంలో బ్రహ్మసూత్ర శివాలయ నిర్మాణానికి గురువారం ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ తన తల్లిదండ్రుల ఆకాంక్ష మేరకు ఆలయ నిర్మాణం చేపట్టామన్నారు. తమ కుటుంబసభ్యులే నిర్మాణ వ్యయాన్ని భరిస్తారన్నారు. ఆలయ నిర్మాణం తర్వాత భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి, నిత్యకల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నేత కొట్టు విశాల్, బలుసులమ్మ ఆలయ ట్రస్టీ కొట్టు అంజిబాబు, వీరంపాలెం బాలత్రిపురసుందరీ పీఠం నిర్వాహకులు గరిమెళ్ల వెంకటరమణ సిద్ధాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవులు

అర్ధరాత్రి కాల్ వచ్చింది



ఉండిలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారని రాత్రి 12 గంటలకు సమాచారం వచ్చింది. వెంటనే 108 సిబ్బందితో కలిసి వేగంగా ప్రమాద స్థలానికి చేరుకున్నాను. అక్కడ పరిస్థితి బీభత్సంగా ఉంది. క్షతగాత్రుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. వారిని ఎలాగైనే కాపాడాలనే తపనతో తక్షణం తీవ్ర గాయాలతో ఉన్న వారికి ప్రథమ చికిత్స అందిస్తూ.. వేగంగా భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించాం. ఆ రాత్రి అక్కడ వైద్యులు సకాలంలో వైద్యం అందించడంతో వారు బతికారు. తీవ్రంగా గాయపడి.. పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న వారిని కాపాడటంలో మేము కూడా ఉండటం చాలా సంతృప్తి కలిగించింది.

– పి.సుబ్బరాజు, 108 పైలెట్

సమయానికి 108 రావడం వల్లే..



ఫిబ్రవరి 16వ తేదిన ఉండి మండలం వెలివర్రు వద్ద రాత్రి 12 గంటలకు మా చిన్నాన్న రుద్రరాజు రామచంద్ర రాజుకు రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. 108కు కాల్ చేయగా కొన్ని నిమిషాల వ్యవధిలోనే అక్కడికి చేరుకోవడంతో భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించాం. సమయానికి 108 రావడంతో ఆయనను రక్షించుకోగలిగాం. నాడు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన 108 పథకాన్ని నేడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమర్థవంతంగా అమలు చేస్తుండటం అభినందనీయం.

– రుద్రరాజు లక్ష్మీ వెంకట సత్యనారాయణరాజు, చిలుకూరు

పశ్చిమగోదావరి జిల్లాలో మండలాలు	19	
108 వాహనాల సంఖ్య	పైలెట్ల సంఖ్య	ఈఎంటీల సంఖ్య
20	50	50

భీమవరం అర్బన్ పరిధిలో..
చేరాల్సిన సమయం : 15 నిమిషాలు
చేరుతున్న సమయం : 14 నిమిషాలు

భీమవరం రూరల్ పరిధిలో..
చేరాల్సిన సమయం : 20 నిమిషాలు
చేరుతున్న సమయం : 17.5 నిమిషాలు

ఒక నెలలో వచ్చే కాల్స్..

భీమవరం అర్బన్ పరిధిలో	భీమవరం రూరల్ పరిధిలో
230 వరకు	150 వరకు





గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందిస్తున్న దృశ్యం (ఫైల్)

సార్ రోడ్డు ప్రమాదం జరిగింది.. తీవ్ర గాయాలతో ఉన్నారు.. త్వరగా రావాలి..

ఒక వ్యక్తిని తాచు పాము కరిచింది.. అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.. త్వరగా రండి..

నిండు గర్భిణి.. నొప్పులు వస్తున్నాయి.. ఇబ్బంది పడుతోంది.. వెంటనే రండి ప్లీజ్..

సమయం ఎంతైనా.. ప్రమాదం ఏదైనా.. స్థలం ఎక్కడైనా.. 108కి కాల్ రాగానే.. నిమిషాల వ్యవధిలో ప్రమాదస్థలానికి చేరుకుని వారి ప్రాణాలను రక్షిస్తూ ఆపద్బాంధవులుగా నిలుస్తున్నారు 108 సిబ్బంది. ప్రమాదంలో ఉన్నవారికి ముందుగా ప్రథమ చికిత్స అందిస్తున్నారు. అవసరమైన వారికి ఆక్సిజన్, వెంటిలేటర్ పెట్టి నిమిషాల వ్యవధిలో ఆస్పత్రులకు తరలిస్తున్నారు. అక్కడ వారికి సమయానికి వైద్యం అందడంతో ప్రాణాలు నిలబడుతున్నాయి. ఈ సేవల్లో కీలక పాత్ర ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్), పైలట్ (డ్రైవర్)లదే. రోజువారీ విధుల్లో ఎతో మందికి సేవలందిస్తున్న వీరు.. సాహసోపేతంగా, తెగువతో బాధితుల ప్రాణాలు కాపాడిన పలు ఉదంతాలను 'సాక్షి'తో పంచుకున్నారు. వారి సేవలతో ప్రమాదం నుంచి బయటపడిన పలువురు బాధితులు కూడా ఆ వివరాలు వెల్లడించారు. – సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్

ఏలూరు జిల్లాలో మండలాలు	27	
108 వాహనాల సంఖ్య	పైలెట్ల సంఖ్య	ఈఎంటీల సంఖ్య
28	68	68

ఏలూరు అర్బన్ పరిధిలో..
చేరాల్సిన సమయం : 15 నిమిషాలు
చేరుతున్న సమయం : 14.30 నిమిషాలు

ఏలూరు రూరల్ పరిధిలో..
చేరాల్సిన సమయం : 20 నిమిషాలు
చేరుతున్న సమయం : 18.20 నిమిషాలు

ఏజెన్సీలో..
చేరాల్సిన సమయం : 30 నిమిషాలు
చేరుతున్న సమయం : 23 నిమిషాలు

ఒక నెలలో వచ్చే కాల్స్..

ఏలూరు అర్బన్ పరిధిలో	ఏజెన్సీ ప్రాంతాల్లో
200 వరకు	100 వరకు

ఏలూరు రూరల్ పరిధిలో.. 130 నుంచి 150 వరకు



108లో క్షతగాత్రుడు గండికోట శ్రీను (ఫైల్)

సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లడం వల్లే..

మాది కురెళ్లగూడెం. ఫిబ్రవరి 18న కూలి పనుల కోసం పూళ్ల వద్దకు వెళ్లాం. రోడ్డు పక్కన బైక్‌లతో నిలబడి ఉన్న మమ్మల్ని బస్సు ఢీకొట్టింది. మావాళ్లు ముగ్గురు అక్కడే చనిపోయారు. తీవ్రంగా గాయపడిన నన్ను 108 సిబ్బంది ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రికి తరలించారు. సకాలంలో చికిత్స అందడంతో ప్రాణాపాయం తప్పింది. నేను కోలుకున్న తర్వాత మావాళ్లు ఈ వివరాలు చెప్పారు. నిజంగా నాకు ప్రాణభిక్ష పెట్టింది వైద్యులతో పాటు 108 సిబ్బంది కూడా. – గండికోట శ్రీను, క్షతగాత్రుడు

తప్పనిసరై.. 108లోనే..



నేను పాలకొల్లు 108లో పనిచేస్తున్న సమయంలో ఓ గర్భిణి పరిస్థితి క్రిటికల్‌గా ఉండటంతో తణుకుకు రిఫర్ చేశారు. వెంటనే అక్కడి నుంచి 108 అంబులెన్సులో ఆమెను తీసుకుని బయలుదేరాం. దారిలో ఆమెకు నొప్పులు ఎక్కువయ్యాయి. ఆమె 108లోనే ప్రసవించే పరిస్థితి వచ్చింది. అసలే పరిస్థితి క్రిటికల్‌గా ఉండి.. తణుకుకు రిఫర్ చేశారు. మార్గంలోనే ఆమెకు నొప్పులు ఎక్కువవడంతో మాకు ఏంచేయాలో పాలుపోలేదు. వైద్యుల సూచన మేరకు వెంటనే ఆమెకు అవసరమైన ప్రథమ చికిత్స అందిస్తూ డెలివరీ చేసి వెంటనే తల్లీబిడ్డను తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించాం. తల్లీబిడ్డా క్షేమంగా ఉండటంతో చాలా సంతోషం కలిగింది. – బి.ప్రశాంతి, ఈఎంటీ

నా ప్రాణాలు కాపాడారు..



మాది యండగండి గ్రామం. పొలంలో పనిచేస్తుండగా పాము కరిచింది. వెంటనే ఆ విషయాన్ని నా కుమారుడికి చెప్పాను. నా కొడుకు తక్షణం 108కి ఫోన్ చేశాడు. కేవలం 15 నిమిషాల్లోనే ఉండి నుంచి యండగండికి 108 సిబ్బంది వచ్చారు. నాకు ప్రథమ చికిత్స అందించి మరో 20 నిమిషాల్లో భీమవరం ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. సకాలంలో వైద్యం అందడంతో నా ప్రాణాలు నిలబడ్డాయి. 108 సిబ్బంది అందించిన వేగవంతమైన సర్వీసు వల్లే నేను ఇప్పుడు బతికి ఉన్నాను. వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.
– భీమవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అంది కోలుకున్న తోట రామారావు

8 రోజుల పాపను రక్షించారు..



పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాలకు చెందిన పి.ప్రదీప్ దంపతులకు పుట్టిన పాపకు అప్పటికి 8 రోజుల వయస్సు. పాప తీవ్ర అనారోగ్యంగా ఉండడంతో భీమవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని, అదీ వెంటిలేటర్ సౌకర్యం ఉన్న అంబులెన్స్‌లో అని వైద్యులు చెప్పారు. వెంటిలేటర్ సౌకర్యం ఉన్న అంబులెన్స్ కావాలంటే రూ.22 వేలు అడిగారు. పాప తండ్రికి 108 గుర్తుకు వచ్చి ఫోను చేయగా, వెంటిలేటర్ కలిగిన 108 వాహనం నిమిషాల వ్యవధిలో వచ్చింది. సిబ్బంది పాపకు వెంటిలేటర్ అమర్చి.. శరవేగంగా కాకినాడకు తీసుకువెళ్లడంతో పాపకు సకాలంలో వైద్యం అందింది. ఆ పాప ప్రాణాలు నిలబడ్డాయి. – పాప తండ్రి పి.ప్రదీప్, శివదేవుని చిక్కాల

అందుబాటులో సౌకర్యాలు, మందులు..



సహాయం కోసం ఏ సమయంలో కాల్ వచ్చినా సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. వేగంగా స్పందించే పనితీరు వల్ల ఆపదలో ఉన్నవారిని కాపాడగలుగుతున్నారు. 108లో సౌకర్యాలు, మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వాహనాలకు మరమ్మతులు లేకుండా, నిర్వహణ లోపాలు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నాం. – బీవీవీఎస్ ప్రకాష్, 108 జిల్లా కోఆర్డినేటర్

భారీగా సెల్‌ఫోన్ల రికవరీ

రూ. 41.40 లక్షల విలువైన ఫోన్ల స్వాధీనం





బాధితురాలికి సెల్‌ఫోన్ అందచేస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

ఏలూరు టౌన్: విలువైన సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన బాధితులకు ఏలూరు జిల్లా పోలీసులు భరోసాగా నిలుస్తున్నారు. వెతికి... వెంటాడి... వేటాడి మరీ సెల్‌ఫోన్లను వారికి అందచేస్తూ ఉండటంతో పోలీసుల పనితీరు పట్ల జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఐదుసార్లు భారీ ఎత్తున సెల్‌ఫోన్లను రికవరీ చేసిన ఏలూరు పోలీసులు తాజాగా 6వ విడత పెద్ద ఎత్తున సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. ఈ మేరకు గురువారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ విలేకరుల సమావేశం నిర్వహించారు. సెల్‌ఫోన్ల రికవరీతో పాటు బాధితులకు వారి సెల్‌ఫోన్లను అందచేశారు. ఈ సమావేశంలో ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు, ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ ఉన్నారు. ఏలూరు జిల్లాలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు ప్రత్యేకంగా సైబర్ క్రైం వింగ్‌తో పాటు సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా సెల్‌ఫోన్లను భారీ ఎత్తున రికవరీ చేశారని ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ తెలిపారు. 6వ విడతలో 207 సెల్‌ఫోన్లను రికవరీ చేశామని తెలిపారు. వీటి విలువ మార్కెట్‌లో రూ. 41.40 లక్షలు ఉంటుందన్నారు. కొందరు బాధితులకు వారి సెల్‌ఫోన్లను అందచేయడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. ఇంతవరకు ఏలూరు జిల్లాలో 6 విడతల్లో 808 సెల్‌ఫోన్లు రికవరీ చేయగా వాటి విలువ రూ. కోటి 46 లక్షలకు పైగా ఉందన్నారు. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు సెల్‌ఫోన్లను ట్రేస్ చేసి వాటిని రికవరీ చేస్తున్నామని తెలిపారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు వాట్సప్ నెంబర్ 95503 51100కు తమ వివరాలను తెలియచేయాలని ఎస్పీ కోరారు. సెల్‌ఫోన్ ఐఎంఈఐ నెంబర్, సెల్‌ఫోన్ నెంబర్, ఆధార్, ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే సైబర్ క్రైం, సీసీఎస్ పోలీసులు మొబైల్ ట్రాకింగ్ ద్వారా గుర్తించి రికవరీ చేసేందుకు కృషి చేస్తారని తెలిపారు. సమావేశంలో ఎస్‌బీ సీఐ వీ.రవికుమార్, డీసీఆర్‌బీ సీఐ ఎం.సుబ్బారావు, సైబర్ టీం టెక్నికల్ ఎస్‌ఐ మధు వెంకటరాజు, సిబ్బంది శివ తదితరులున్నారు.

● గడపగడపకు సంక్షేమం



పెనుగొండ : మండలంలోని సిద్ధాంతంలో గడపగడపకు మన ప్రభుత్వంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

లారీ ఢీకొని ఇద్దరి మృతి





మీర్జాపురం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ , లారీ చక్రాల కింద నలిగి పోయి మృతిచెందిన కాకుమాను రాంప్రసాద్

నూజివీడు: లారీ ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన మండలంలోని మీర్జాపురం వద్ద గురువారం జరిగింది. రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కృష్ణాజిల్లా బాపులపాడు మండలం బిళ్లనపల్లికి చెందిన వెలగ ప్రభాకర్‌రావు (65), కాకుమాను రాంప్రసాద్ (41) ఉదయం 9.30 గంటల సమయంలో బిళ్లనపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై మీర్జాపురం వెళుతున్నారు. మీర్జాపురంలోని బిళ్లనపల్లి అడ్డరోడ్డు వద్ద నూజివీడు–హనుమాన్‌జంక్షన్ రోడ్డు ఎక్కి జంక్షన్ వైపునకు వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన గుజరాత్‌కు చెందిన లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. రాంప్రసాద్ పైకి లారీ చక్రాలు ఎక్కడంతో కాళ్లు ఛిద్రమైపోయాయి. మృతుడు ప్రభాకర్‌రావుకు ముగ్గురు కుమారులుండగా, రాం ప్రసాద్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. రాంప్రసాద్ హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి ట్రస్టుకు రూ.3 లక్షల విరాళం



దాత జానకిరామరాజుకు విరాళం బాండ్ పత్రాన్ని అందజేస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ. 3,00,116 విరాళంగా అందజేశారు. కైకలూరుకు చెందిన పెన్మత్స అచ్యుత జానకిరామరాజు, శ్యామలా దేవి దంపతులు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేయగా, దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

బంగ్లా మహిళలకు ప్రత్యేక శిక్షణ



డ్రైఫ్లవర్ శిక్షణా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ టి.జానకీరామ్, బంగ్లా ప్రతినిధులు

తాడేపల్లిగూడెం: తొలి అంతర్జాతీయ శిక్షణకు వేదికగా మారిన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని కేవీకేలో బంగ్లా మహిళలకు గురువారం ఎండుపూలతో, ఆకులతో కళాకృతులు తయారు చేయడంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. సొసైటీ ఫర్ బ్రైట్ సోషల్ సర్వీసెస్ సంస్థ, షేర్ ఏ బంగ్లా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఇక్కడకు వచ్చిన పది మంది బృందంలోని సభ్యులకు శిక్షణ కొనసాగింది. కట్ ఫ్లవర్ విభాగంలో ప్రాసెసింగ్, ఉత్పత్తుల తయారీ, చామంతి, జర్బరా, రోజ్, బంతి, తూజ ఆకులను ఎండబెట్టే పద్ధతులు, ప్రెస్సింగ్ విధానాల గురించి వివరించారు. ఎండినపూలు, ఆకులతో గ్రీటింగ్ కార్డులు, తయారు చేయించారు. వీసీ టి.జానకీరామ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగింది.

నకిలీ బంగారం కేసులో ఆరుగురి అరెస్టు

ఆకివీడు: తక్కువ ధరకు బంగారం విక్రయిస్తున్నట్లు చెప్పి, నకిలీ బంగారం అమ్మిన సంఘటనపై స్థానిక తెలగపాముల ప్రాంతానికి చెందిన ఆరుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ కే.రాజారెడ్డి గురువారం చెప్పారు. అనకాపల్లి జిల్లా కే.కోట మండలం, మల్లంపాలెం గ్రామానికి చెందిన నాగిరెడ్డి మహేష్ ఫిబ్రవరి 18వ తేదీన స్థానిక తెలగపాముల ప్రాంతానికి వెళ్లి తక్కువ ధరకు బంగారం వస్తుందని కొనుగోలు చేయగా, దానిని పరీక్షించగా నకిలీదని తెలియడంతో ఫిబ్రవరి 19వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తెలగ పాముల ప్రాంతానికి చెందిన బండి శంకర్, చింత నాగరాజు, నాగులూరి శ్రీను, బసాని ఏడుకొండలు, బండి నర్సింహులు, పసుపులేటి దేవదాసులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వివరించారు.

అదనపు కట్నం వేధింపుల కేసు నమోదు

తణుకు: తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు తణుకుకు చెందిన మహిళ ఫిర్యాదు చేశారని తణుకు పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ తెలిపారు. స్థానిక కుమ్మర్ల వీధిలో ఉంటున్న పెన్నాడ నాగతేజస్వినికి తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన పెన్నాడ సురేష్‌తో 2017లో వివాహం జరిగింది. అప్పటినుంచి భర్త సురేష్ అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నాడు. అతనికి కుటుంబసభ్యులు కూడా సహకరిస్తున్నట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

స్పెషల్ బీఎడ్ స్పాట్ అడ్మిషన్లు

ఏలూరు రూరల్: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 2022–23లో బీఎడ్ ప్రత్యేక విద్యలో శిక్షణకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం కో–ఆర్డినేటర్ డి శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో 50 శాతం మార్కులు పొందిన ఓబీసీ విద్యార్థులు, 45 శాతం మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

కృష్ణా కాల్వలో పసికందు మృతదేహం

ఏలూరు టౌన్: ఏలూరు కృష్ణా కాలువలో చిన్నారి మృతదేహం కలకలం రేపింది. స్థానికుల సమాచారంతో టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చిన్నారి మృతదేహాన్ని వెలికితీశారు. నగరంలోని పలు ఆస్పతుల్లో ఈ ఘటనపై విచారణ ప్రారంభించారు. పలు ఆసుపత్రుల రికార్డులను తనిఖీ చేసి శిశువు కాలువలో పడవేయడానికి గల కారణాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏలూరు టూటౌన్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐ రామకోటేశ్వరరావు, సిబ్బంది విచారణ చేస్తున్నారు. ఒకరిద్దరు మహిళలు గురువారం ప్రసవించడంతో పోలీసులు వారి ఇళ్లకు వెళ్లి మరీ బిడ్డ ఉన్నదీ లేనిదీ ఆరా తీశారు. వారు చంటి బిడ్డలతో ఉండటంతో ఇతర ఆస్పత్రుల నుంచి సమాచారం సేకరించే ప్రయత్నం చేస్తున్నారు.

తల్లిని కొట్టి, బెదిరించిన కుమారుడిపై కేసు

ద్వారకాతిరుమల: తల్లిని కొట్టి, బెదిరించిన కుమారుడిపై గురువారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం. మండలంలోని జి.కొత్తపల్లికి చెందిన లక్కాబత్తుల ఏసు, తన కుమారుడు లక్కాబత్తుల వినోద్‌కుమార్‌లు ఏడాది క్రితం గ్రామంలోని తమ సెంటున్నర ఇళ్ల స్థలాన్ని అమ్మివేశారు. ఈ విషయంపై ఏసుకు, తన భార్య పెద్దింట్లుకు, కుమారుడు వినోద్‌కుమార్‌కు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈనెల 7 సాయంత్రం 4 గంటల సమయంలో వినోద్‌కుమార్ తన తల్లి పెద్దింట్లును కర్రతో కొట్టి, చంపుతానని బెదిరించాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: భర్త వేధింపులు భరించలేక ఓ గృహిణి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణ శివారు ప్రాంతంలో చోటుచేసుకుంది. సీఐ దారావతు రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం పట్టణ శివారు ప్రాంతం యాళ్లవానిగరువు పంచాయితీ సబ్బేవారి పేటకు చెందిన ఈద సుమ (23) బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఈద సాయికిరణ్‌తో 2018లో వివాహం జరిగింది. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సాయి కిరణ్, అత్త ఏసుమణి, ఆడపడుచు అనూరాధలు అదనపు కట్నం తీసుకురావాలని వేధించేవారని, వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సుమ తండ్రి నేలపాటి రామారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉంగుటూరు కోనేరుపేటలో చోరీ

ఉంగుటూరు: ఉంగుటూరు కోనేరుపేటలో కొప్పల సత్యనారాయణ ఇంట్లో జరిగిన చోరీలో 10 కాసులు బంగారం, 30 తులాల వెండి చోరీకి గురైందని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు శారు. సత్యనారాయణ, అతని భార్య బంధువుల ఇంట్లో వివాహానికి వెళ్లారు. గురువారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి చోరీ జరిగినట్లు గుర్తించారు. పక్కనే ఉన్న భానుమూర్తి మాస్టారు ఇంట్లో కూడా చోరీ జరిగింది.

జగనన్న కాలనీల్లో జోరుగా నిర్మాణాలు

- నిర్మాణాలను వేగవంతం చేసే ప్రయత్నాల్లో అధికారులు
- ఉగాది నాటికి సామూహిక గృహప్రవేశాలకు ఏర్పాట్లు



ముదునూరులో ఊరుగా రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీ

పెంటపాడు: సొంతిల్లు... ప్రతి ఒక్కరికీ ఓ అందమైన కల.. పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసే ధ్యేయంతో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోంది. నవరత్నాలలో భాగంగా పేదలందరకీ ఇళ్ల పథకాన్ని శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశచరిత్రలోనే తొలిసారిగా లక్షలాధిమందికి ఇళ్లస్థలాలు మంజూరు చేయడంతో పాటు, ఇళ్ల నిర్మాణాలను, అవసరమైన వనరులను సమకూర్చుతూ తోడ్పాటు నందిస్తున్నారు. దీంతో వైఎస్సార్ జగనన్న కాలనీల రూపంలో కొత్త గ్రామాలు రూపుదిద్దుకొంటున్నాయి. ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో గతంలో గృహప్రవేశాలు చేసినవి కాకుండా అధనంగా మరికొంత మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం పనిచేస్తోంది. వివిధ దశల్లో 5,555 ఇళ్ల నిర్మాణాలు పేదలకు స్తలాలు మంజూరు చేయడంతో పాటు, ఇళ్లు నిర్మించుకొనే స్తోమతలేని వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. దీంతో గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. తాడేపల్లిగూడెం నియోజకవర్గం పరధిలోని పెంటపాడు, రూరల్ మండలం అర్బన్ పరిధిలో మొత్తం 63 లే అవుట్‌ల్లో మొత్తం 15,410 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లస్థలాలు కేటాయించింది. అలాగే సొంత స్థలాలు ఉన్నవారికి సైతం గృహాలు మంజూరుచేసింది. జగనన్న లే అవుట్‌లలో 5963 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా ఇప్పటివరకు 3163 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తిచేసి గృహప్రవేశాలు చేసారు. ఉగాది నాటికి అధనంగా మరో 1551 గృహాలు పూర్తిచేసి గృహప్రవేశ పండుగ నిర్వహించాలనే అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. దీనికి తగ్గట్టుగానే ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తోంది.

పేదల జీవితాలలో వెలుగులు

ప్రభుత్వ సహకారంతో ఆశల సౌధాలు రూపుదిద్దుకోవడంతో పేదల జీవితాలు వెలుగులు నిండుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలకు గానూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఒక్కో గృహానికి రూ. 1.80 లక్షలు కేటాయిస్తోంది. వివిధ దశల్లో నిర్మాణాలు పూర్తిచేసిన లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్న ప్రభుత్వం లబ్ధిదారులకు అడుగడుగునా బాసటగా నిలుస్తోంది. దీంట్లో భాగంగా ప్రభుత్వం మంజూరు చేస్తున్న సొమ్ముకు అధనంగా డీఆర్‌డీఏ విభాగంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు మరో రూ. 35 వేలు రుణంగా అందిస్తోంది. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధికప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం రోడ్లు, తాగు నీరు, విద్యుత్, తదితర సౌకర్యాల కల్పనకు చొరవ చూపుతోంది. నిర్మాణం చేపట్టిన వారికి ఇసుక, సిమెంట్ ఐరన్‌తో పాటు, నిర్మాణానికి అవసరమైన వివిధ వస్తువులు ప్రభుత్వం అందిస్తోంది.

నిర్మించి ఇస్తున్నాం



ఇళ్లు నిర్మించుకోలేని పేదలను గుర్తించి మేస్త్రిలను పిలిచి శాఖాపరంగా నిర్మాణాలు చేసుకొనేందుకు ఆప్షన్-3 కింద ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే పెంటపాడు, రూరల్ మండలాలలో ఏర్పాటు చేశాం. సొంతంగా కట్టుకున్న వారికి ప్రభుత్వం ఉచితంగా 20 టన్నుల ఇసుక అందించంతో పాటు, సిమెంట్ ప్రభుత్వ ధరలకే అందిస్తున్నాం

– ప్రసాద్, హౌసింగ్ డీఈ, తాడేపల్లిగూడెం

క్లుప్తంగా

జూనియర్ సివిల్ జడ్జికి సత్కారం



జూనియర్ సివిల్ జడ్జి నాగ మల్లేశ్వరీకి సత్కారం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహిళా దినోత్సవం సందర్భంగా తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్ మహిళా పోలీసులు జూనియర్ సివిల్ జడ్జి ఎ.నాగమల్లేశ్వరీని బుధవారం రాత్రి ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.ప్రకాశ్ బాబు, డీఎస్పీ శ్రీనాథ్, సీఐలు, పోలీసులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలి



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజు

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణ సిఐ ఎస్‌వీవీ నాగరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో హెల్మెట్ ధారణ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సైలు బోనగిరి రాజు, జిజె ప్రసాద్‌లు హెల్మెట్ ధారణ ప్రయోజనాలను వాహనదారులకు తెలియచేశారు. హెల్మెట్ ఉన్నవారు తప్పనిసరిగా ధరించి వాహనం నడపాలన్నారు. లేనివారు తక్షణం కొనుగోలు చేసి వినియోగించుకోవాలన్నారు. హెల్మెట్ ధరించడంతో వాహనదారులకు, కుటుంబ సభ్యులకు రక్షణ కలుగుతుందన్నారు. జిల్లా ఎస్పీ రవిప్రకాష్ ఆదేశాల మేరకు పోలీసులు చేస్తున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రతతో కీటక జనిత వ్యాధులను అరికట్టవచ్చునని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 13వ వార్డు శివాలయం వీధిలో గురువారం ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలపై క్షేత్ర స్థాయిలో అమలు, పరిశీలన జరిగింది. దోమల ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల పుట్టకుండా ప్రజలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. పరిసరాలలో నిల్వ నీరు లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధింత పారిశుధ్య సిబ్బంది చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు శారద, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశా రోహిణి, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమం



ఓరియంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న వ్యాయామ ఉపాధ్యాయులు

తణుకు: జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి బి.జాన్సన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 11 మండలాలకు చెందిన వ్యాయామ విద్య ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఆర్‌ఐపీఈ ఎం.మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఖేల్ ఇండియా, ఫిట్ ఇండియా, అకడమిక్ మానిటరింగ్ యాప్ తదితర అంశాలపై చర్చించారు. జోనల్ కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్‌తోపాటు ఇటీవల ఉత్తరాఖండ్‌లో జరిగిన కబడ్డీ పోటీల్లో ఇరగవరం మండలం రేలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరపున పాల్గొని సిల్వర్ మెడల్ సాధించడంలో ప్రముఖ పాత్ర పోషించిన పీఈటీ వి.సుమలతను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నతూన కార్యక్రమాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చింతలకాయల సత్యనారాయణ, కార్యదర్శిగా సంకు సూర్యనారాయణ, కోశాధికారిగా కటికతల బాబూరావులను ఎన్నుకున్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వన్ టౌన్ నార్త్ సెక్షన్ హౌసింగ్ బోర్డు సబ్ స్టేషన్, పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ రిలియన్స్ ఫీడర్, మహాలక్ష్మినగర్ ఫీడర్ లలో మరమ్మతులు, విద్యుత్ లైన్‌లకు ఈ నెల 10వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు డీఈ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు.

తాటాకిల్లు దగ్ధం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని 29వ వార్డు సంజీవనగర్‌లోని రెండు పోర్షన్ల తాటాకిల్లు గురువారం అగ్నికి ఆహుతైంది. జి.ఆదాం, సామ్యేలుకు చెందిన ఇళ్లల్లో గ్యాస్ బండ నుంచి మంటలు వ్యాపించడంతో అగ్ని ప్రమాదం సంభవించి రూ.2 లక్షల విలువైన సామగ్రి కాలిపోయింది. అగ్నిమాపక అధికారి సీహెచ్ సూర్యప్రకాశరావు సిబ్బంది సహకారంతో మంటలను అదుపు చేశారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

భీమవరం (ప్రకాశం చౌక్): స్థానిక మున్సిపాలిటిలో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ జేడీవీ సత్యనారాయణ విధుల్లో నిర్లక్ష్యం కారణంగా కలెక్టర్ అదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ గురువారం చెప్పారు.

దోమల నివారణలో భాగస్వాములు కావాలి



జగన్నాథపురంలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దోమల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మలేరియా తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. గురువారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులకు కారణమవుతాయన్నారు. దోమలను లార్వా దశలోనే నివారించడం మేలని సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి అక్కడి పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సత్యవేణి, ఆరోగ్య కార్యకర్త కోటమ్మ, ఆరోగ్య సహాయకుడు హరిబాబు, ఎస్.ప్రసాద్‌బాబు, జి.కాంతారావు,ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్



చెక్కును అందజేస్తున్న యువనేత కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం అర్బన్ : ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ ఆపద్బాంధవుడిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అండగా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు. పట్టణంలోని 27వవార్డుకు చెందిన బొర్రా రాజేశ్వరికి రూ. 3లక్షల చెక్కును, పెంటపాడు మండలం యానాలపల్లి గ్రామానికి చెందిన బి సుధాకర్‌కు రూ. 50వేలు చెక్కు, కొట్టు విశాల్ చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆపదలో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు ఉపముఖ్యమంత్రి కొట్టు అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. పార్టీలకు అతీతంగా అందరికి లబ్ధిని చేకూరుస్తున్నారని అన్నారు. కొట్టు సహకారంతో నియోజకవర్గంలో రూ. 7 కోట్లు విలువైన చెక్కులను అందచేశామన్నారు.

కంటి సంరక్షణపై జాగ్రత్తలు తీసుకోవాలి



వైఎస్సార్ కంటి వెలుగులో పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఇరగవరం: కంటి సంరక్షణ పై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఇరగవరం పీహెచ్‌సీ వైద్యులు వి.ఎల్ కె రెడ్డి, మౌనికాలు తెలిపారు. మండలంలోని సూరంపూడి గ్రామంలో గురువారం వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా కంటి సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా 56మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 14మందికి కళ్లజోళ్ళు అందజేశారు. 42మందికి మందులు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. కంటి సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఆకు కూరలు, విటమిన్ ఎ ఎక్కువగా ఉన్నా ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అసిస్టెంటు రామి రెడ్డి, గ్రామ సర్పంచ్ కఠారి చంద్రమణి, రామారాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది హెచ్ ఎస్ మూర్తి, ఏఎన్ఎం నాగ లక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రియా, హెల్త్ అసిస్టెంటు కిషోర్, ఆశా వర్కర్లు రేఖా, రాణి, పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



మంచిలిలో ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామరావు తదితరులు

అత్తిలి: ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పనులు నాణ్యతగా ఉండాలని, యుద్ద ప్రాతిపదికన పనులు పూర్తిచేయాలని అత్తిలి ఎంపీడీవో వీవీఎస్ రామారావు అన్నారు. అత్తిలి మండలంలోని ఉనికిలి, మంచిలి గ్రామాల్లో నిర్వహిస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పనులకు సంబంధించి గట్లు పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వట్టికూటి అనంతలక్ష్మి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ తేలి శాంతి స్వరూప్, మహేష్, పంచాయతీ కార్యదర్శి ఫణిరాజు, దివ్య, దానం లావణ్య, మెట్లు ప్రకాష్ పాల్గొన్నారు.

ఉగాది వేడుకల బ్రోచర్ ఆవిష్కరణ



ఉగాది వేడుకల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు పండుగలే పట్టు కొమ్మలని, 34 ఏళ్లుగా ఉగాది వేడుకలను నిర్వహిస్తుండటం స్ఫూర్తిదాయకమని విశ్వ హిందూ పరిషత్ జిల్లా నాయకులు మంతెన రామచంద్రరాజు అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాది వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. జేపీ రోడ్డు, హౌసింగ్ బోర్డు కాలనీలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం అధ్యక్షుడు మంతెన రామ్‌కుమార్ రాజు, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ కనుమరుగైపోతున్న హిందూ సంప్రదాయలను కాపాడుకోవాల్సిన బాధ్యతా మనందరిపై ఉందని, ఉగాది వేడుకలను విజయవంతం చేయాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ శోభాకృత నామ సంవత్సర వేడుకలను ఈనెల 22న భీమేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్నామని, ఈనెల 11 నుంచి ప్రాచీన సంస్కృతి, మన తెలుగు బాషా, ఉగాది ఔన్నత్యంపై కళాశాల, పాఠశాల, దేవాలయాల్లో సదస్సులు, విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సబ్ ట్రెజరీ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇస్తున్న పెన్షన్‌దారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం గూడెం పట్టణంలోని తహసీల్దార్, సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందచేశారు. 11వ పీఆర్సీ అమలు చేయాలని, ప్రతి నెల ఒకటవ తేదీనే పెన్షన్లు అందించాలని వారు వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో దాసం నాగేశ్వరరావు, కె.బాలకృష్ణ, ముస్తాఫా, విస్సంరాజు, పార్వతి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ జాతర ప్రారంభం

యలమంచిలి: అడవిపాలెంలో కనకదుర్గమ్మ జాతర గురువారం ప్రారంభమైంది. వంశపారంపర్య ధర్మకర్తలు అమ్మవారికి తొలి పానకం కావిడి, సారె, చీర సమర్పించి గ్రామోత్సవంగా అమ్మవారిని పుట్టింటికి తీసుకువచ్చారు. అమ్మవారి ఘటాలకు రోజు విడిచి రోజు గ్రామోత్సవం చేస్తారు.

నగదు స్వాహాపై విచారణ

పాలకోడేరు: గరగపర్రు గ్రామంలోని పలు డ్వాక్రా సంఘాల్లో నగదు స్వాహా ఘటనపై డ్వాక్రా ఏపీఎం రవికుమార్ గురువారం విచారణ చేశారు. గ్రామంలోని ఒక వీవోఏ పరిధిలో ఉన్న డ్వాక్రా సంఘాలకు సంబంధించిన రుణాల చెల్లింపు వ్యవహారంలో సదరు వీవోఏ నగదు స్వాహా చేసినట్లు పలువురు ఆరోపించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో ప్రాథమిక విచారణ చేసినట్లు రవికుమార్ తెలిపారు. పూర్తిస్థాయి విచారణ తరువాతే ఎంత మొత్తంలో నగదు స్వాహా అయిందో తెలుస్తుందని పేర్కొన్నారు.

ఆకుతీగపాడులో పొలంబడి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి వెంకటేశ్వర్లు

పెంటపాడు: ఉత్తమ దిగుబడులకు రైతులు తప్పక వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆకుతీగపాడులో క్లష్టర్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా ఆయన గురువారం రైతులకు పంట యాజమాన్య పద్దతులు వివరించారు. పంట పొట్ట దశలో ఉన్న సందర్భంగా 20 కేజీల పోటాష్, 45 కేజీల యూరియా ఎకరాకు వేసుకోవాలన్నారు. పంటకు వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందన్నారు. గింజ తోడుకుంటుందన్నారు. గింజ నాణ్యత ఈ ఎరువులు వేసుకోవాలని డీఏవో సూచించారు. ప్రస్తుతం వరిపైరుపై మానికాయ తెగులు ఆశించిందన్నారు. ఈ ఉధృతి ఉందన్నారు. ఏ విధమైన పురుగుమందులు, దోమల మందులు వాడవద్దన్నారు. సేంద్రియ పద్దతిలో తూడికాడ కషాయం తయరు చేసుకొని వాడుకోవాలన్నారు. ఏడీఏ మురళీకృష్ణ, మండల వ్యవసాయధికారి కె. పార్థసారధి మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడిలు సాధించేలా రైతులు మార్పు చెందాలన్నారు. వచ్చే వేసవికి నేలలో సారం ఉండేలా జనుము, జీలుగ, పిల్లిపెసర, తదితర అపరాల పంటలు వేసుకోవాలని ఏడీఏ పి. మురళీకృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాస్, సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ కొణతాల వెంకట్రావు, ఆకుల శ్రీనివాస్, మోఖమాట్ల వీరన్న, చింతల నాగరాజు, జాలపర్తి నాగేశ్వరరావు, వీఏఏలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.





